ప్రాణదాతలకు
ప్రోత్సాహకం
● క్షతగాత్రులకు సహకరిస్తే ఇబ్బందులు ఉండవు
● 'గుడ్ సమరిటన్'పై కొరవడిన అవగాహన.. 7
ప్రారంభమై నాలుగేళ్లయినా ప్రయోజనం శూన్యం



వరి.. ట్యాంకర్ తడి..

● పంటను కాపాడుకునేందుకు మహిళా రైతు యత్నం

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలు వాడిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వ్యవసాయ బావులు, బోరుబావుల్లో నీరు తగ్గి వరి పంటలు ఎండి పోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి పంటను దక్కించుకునేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు మండల కేంద్రానికి చెందిన గొట్టే రేణుక అనే మహిళ రైతు నాలుగు ఎకరాల్లో రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తోంది. పంట పొట్ట దశలో ఉండటంతో బోరులో నీరు తగ్గి, తడులు అందించేందుకు నానా తంటాలు పడుతోంది. మరో 25 రోజులు అయితే, పంట చేతికి వస్తుంది. ఈ క్రమంలో పంట ఎండిపోతుండటంతో చూడలేక ట్రిప్పుకు రూ.500 చొప్పున ట్యాంకర్ ద్వారా పంటకు నీరు అందిస్తోంది. రోజుకు 10 ట్రిప్పుల నీటిని తీసుకువచ్చి పంటకు అందిస్తోంది.

- అక్కన్నపేట, ఫిబ్రవరి 28



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

'పది' పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో పదోతరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో పదోతరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 79 కేంద్రాల్లో మొత్తం 14,136 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకూడదని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ పల్వాన్‌కుమార్, డీపీవో దేవకీదేవి, విద్యుత్‌శాఖ, ఆర్టీసీ, పోస్టల్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో డీసీసీబీ

● పదేళ్లలో నాలుగింతలు పెరిగిన టర్నోవర్
● రైతులకు అన్నిరకాల రుణాలు
● ప్రతీ మండల కేంద్రంలో బ్యాంక్ బ్రాంచ్ ఉండాలన్నదే ధ్యేయం
● డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



చిట్టి దేవేందర్‌రెడ్డి

ఫటా ఫట్

కొండపాక, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పదవీ కాలంలో డీసీసీబీ బ్యాంకును రూ.450కోట్ల నుంచి రూ.2450 కోట్లకు టర్నోవర్ చేసి రైతులకు అన్నిరకాల రుణాలు అందిస్తూ అండగా నిలిచామని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

పదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి?

నేను 2015లో డీసీసీబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాను. రెండోసారి డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్నాను. బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.450 కోట్ల టర్నోవర్ మాత్రమే ఉన్నది. ప్రస్తుతం అది రూ.2450 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుంది.

బ్యాంకు అభివృద్ధికి మీరు చేసిన కృషి?

డీసీసీబీని అభివృద్ధిపథంలో నడపడంతో ఉద్యోగుల సమష్టి కృషి ఎంతో ఉంది. పదేళ్ల క్రితం 150 మందితో ఉన్న ఉద్యోగులు ప్రస్తుతం 350 మంది పనిచేస్తున్నారు. వీరందరి సమష్టి కృషితో బ్యాంకును అభివృద్ధిలో తీసుకెళ్తున్నాం.

ప్రస్తుతం ఎన్ని బ్రాంచీలు?.. ఇంకేమైనా ప్రారంభిస్తారా?

70 సంవత్సరాల్లో డీసీసీబీ ఆధ్వర్యంలో 23 బ్రాంచ్‌లు మాత్రమే ఉన్నాయి. ఈ పదేళ్లలో వాటిని 49 బ్రాంచులకు పెంచాం. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రతి మండల కేంద్రంలో బ్యాంకును ఏర్పాటు చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. 10 పక్కా భవనాలతో బ్యాంకులు నడుస్తున్నాయి. ఇందులో గతంలో మూడు భవనాలు మాత్రమే ఉండేవి. ఈ రోజుకు పది సొంత భవనాలను ఏర్పాటు చేశాం. భూంపల్లి, మెదక్, వెల్దుర్తి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, ఝరాసంగంలలో కొత్త భవనాలను ఏర్పాటు చేశాం.

మీ బ్యాంకు ద్వారా ఎలాంటి రుణాలు అందిస్తున్నారు?

గతంలో ఎల్‌టీ, క్రాప్ లోన్స్, గోల్డ్ లోన్స్ మాత్రమే ఉండేవి. ఇందులో అప్పుడు గోల్డ్ లోన్స్ రూ.25 కోట్లు మాత్రమే టర్నోవర్ ఉండగా ప్రస్తుతం రూ.327 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది . కొత్తగా మహిళా గ్రూపులకు రూ.456 కోట్ల రుణాలను అందజేసి వారిలో ఆర్థిక పరిపుష్టికి బ్యాంకు అండగా నిలిచింది. గతంలో ఇంటి రుణాలను ఇవ్వలేదు. ప్రస్తుతం రూ.111కోట్ల ఇంటి రుణాలను అందజేశాం. ప్రతి రైతు సొంత ఇల్లు కట్టుకోవాలని ఉద్దేశంతో వారికి బ్యాంకు అండగా నిలుస్తుంది. ఇంటి నిర్మాణం కోసం ఎకరాకు రూ.6.40లక్షలు రుణంగా అందజేస్తున్నాం.

రైతులకు ఎలాంటి రుణాలు అందజేస్తున్నారు?

రైతునేస్తం కింద ఎకరానికి రూ.3లక్షలు, స్వయంకృషి కింద రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు, పౌల్ట్రీ, ట్రాక్టరు, కారు, జేసీబీ, బైకు లాంటి వాటికి రుణాలు అందిస్తున్నాం. ల్యాండ్ డెవలప్మెంట్ కూడా రుణం ఇస్తున్నాం. కేవలం అరగంటలోనే గోల్డ్ లోన్ అందజేస్తున్నాం. రైతుల పిల్లల ఉన్నత చదువుల కోసం రూ.25 లక్షల వరకు రుణం అందజేస్తున్నాం. డీసీసీబీ అన్ని ఆన్‌లైన్ సేవలను అందిస్తుంది. ఫోన్ పే, గూగుల్ పే నెట్ బ్యాంకింగ్ లాంటి సేవలను కూడా అందిస్తుంది.

అప్రమత్తతతో అడ్డుకట్ట

జిల్లాలో మండుతున్న ఎండలు

● అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం
● గడిచిన ఏడాది జిల్లాలో 172 ఫైర్ యాక్సిడెంట్లు
● జాగ్రత్తగా ఉంటే నివారణ ● జిల్లాలో మొత్తం 4 ఫైర్ స్టేషన్లు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవి రాకముందే రోజురోజుకూ ఎండలు తీవ్రతరమవుతున్నాయి. ఈ క్రమంలో వేసవిలో అగ్నిప్రమాదాలు కూడా ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా అడవుల్లో, వ్యవసాయబావుల వద్ద, పరిశ్రమల్లో, హోటళ్లలో, ఆసుపత్రుల్లో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు. ఇప్పటికే జిల్లా అగ్నిమాపక అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఒకవేళ ఈ ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు.



జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల నెంబర్లు

సిద్దిపేట	8712699250
దుబ్బాక	8712699252
గజ్వేల్	8712699254
హుస్నాబాద్	8712699256

గడిచిన ఏడాదిలో 172 అగ్ని ప్రమాదాలు

జిల్లాకేంద్రంలో, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాకలో ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. గతేడాది నుంచి ఇప్పటి వరకు ఈ 4 ఫైర్ స్టేషన్ల పరిధిలో 172 అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాల్లో దాదాపు రూ.1.74 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. దాదాపు రూ.10.74 కోట్ల ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది అధికారులు కాపాడారు. జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

డయల్ 101

ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు కాల్ చేసి సమాచారం అందించాలి. ఆ ప్రాంతంలోని ఫైర్ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేస్తారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలు

- వంట చేస్తున్నప్పుడు మధ్యలో విడిచి పెట్టి బయటకు వెళ్లడం చేయకూడదు. మండే పదార్థాలు పొంగి గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది. గ్యాస్ స్టవ్, సిలిండర్, రెగ్యులేటర్‌లో ఏదైనా సమస్య వస్తే సొంతంగా రిపేర్ చేయకూడదు. ఊరికి వెళ్లేప్పుడు సిలిండర్ ఆఫ్ చేసి వెళ్లాలి. ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆపేయాలి.

హోటళ్లలో

హోటళ్లలో ఫైర్‌సేఫ్టీ తప్పకుండా ఉండాలి. ఎయిర్ కండిషనింగ్ ద్వారా మంటలు వ్యాపించకుండా డ్యాంపర్స్‌ను

మిగతా 8వ పేజీలో

హుస్నాబాద్ ఏవో సస్పెండ్

● బినామీ రైతుల పేర నకిలీ పర్మిట్లు
● అధికారుల సంతకాలు ఫోర్జరీ

హుస్నాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సీసీఐకి పత్తిని విక్రయించేందుకు బినామీ రైతుల పేర నకిలీ పర్మిట్లు ఇచ్చిన హుస్నాబాద్ వ్యవసాయ అధికారి మామిండ్ల నాగరాజును శుక్రవారం సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ గోపీ ఉత్తర్వులు జారీ చేశారు. మామిండ్ల నాగరాజు హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ ఏఈవో స్వామి, మీర్జాపూర్ ఏఈవో సంగీత, హుస్నాబాద్ ఏఈవో శివరాంల సంతకాలను ఫోర్జరీ చేసి పత్తి పంట వేయకున్నా వేసినట్లుగా బినామీ రైతుల పేరున సీసీఐకి విక్రయించేలా నకిలీ పర్మిట్లు ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై సంబంధిత ఏఈవోలు కూడా తమ సంతకాలను ఫోర్జరీ చేశాడని అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి వారం క్రితం హుస్నాబాద్‌లో విచారణ జరిపారు. నాగరాజు మహ్మదాపూర్ ఏఈవో స్వామి పేరుతో 4, మీర్జాపూర్ ఏఈవో సంగీత పేరుతో 12, హుస్నాబాద్ ఏఈవో శివరాం పేరుతో 2 పత్తి వేయని రైతులకు ఫోర్జరీ సంతకాలతో మొత్తం 18 నకిలీ పర్మిట్లను ఇచ్చినట్లు విచారణలో తేలింది. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపించడంతో నాగరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పౌల్ట్రీ రైతులను పట్టించుకోని ప్రభుత్వం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



చికెన్ తింటున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పౌల్ట్రీ యజమానులు

సిద్దిపేటటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేటలో జిల్లా పౌల్ట్రీ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చికెన్, గుడ్డు మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో సృష్టించే అపోహలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. చికెన్ బాగా ఉడకపెట్టి తింటే ఎలాంటి వైరస్ సోకదని, 70 డిగ్రీల వరకు ఉడకపెడితే ఎలాంటి వైరస్ ఉండదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చెప్పిందన్నారు. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద పౌల్ట్రీ పరిశ్రమ సిద్దిపేట జిల్లాలోనే ఉందని, చికెన్ తింటే ఎలాంటి హాని లేదని సూచించారు.

ఉచిత చికెన్, గుడ్ల మేళాకు ఎగబడిన జనం

పట్టణంలో నిర్వహించిన ఉచిత చికెన్, గుడ్ల మేళాకు పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు చికెన్, గుడ్డు తినేందుకు ఎగబడ్డారు. నిర్వహకులు బారికేడ్లు పెట్టి చికెన్, గుడ్లను వచ్చినవారిని అందించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మేళాకు వచ్చిన ప్రతి ఒక్కరూ వాటిని తినేందుకు ఆసక్తి కనబరిచారు.



చికెన్‌మేళాకు వచ్చిన జనం


ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలి

● సంచార పుస్తక ప్రదర్శన ప్రారంభించిన అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సంచార పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేటకల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ హైస్కూల్‌లో శనివారం కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ వారి నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సంచార పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో ఇమాజినేషన్ పవర్ పెరుగుతుందన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌బీటీ రీజినల్ మేనేజర్ డాక్టర్ మోహన్, సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, మండల విద్యాధికారి రాజప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, కవులు ఐతా చంద్రయ్య, గరిపల్లి అశోక్, జంగిటి శాంతాకుమారి, సమ్మెట ఉమాదేవి, ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాళ్ల రాజేశం, అమ్మన చంద్రారెడ్డి, డబ్బికార్ సురేందర్, పప్పుల రాజిరెడ్డి, కొడిచెల్లి రామానుజ, జెగ్గారి నిర్మల పాల్గొన్నారు.



వనదుర్గకు వైభవంగా
రథోత్సవం
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు
● జయజయ ధ్వానాల మధ్య రథాన్ని లాగిన భక్తులు 7
● మూడో రోజు జాతర సందడి

సిద్దిపేట అభివృద్ధి భేష్

● మేం కూడా అమలు చేస్తాం
● పట్టణాన్ని సందర్శించిన 11 మంది మున్సిపల్ కమిషనర్లు, అధికారులు

సిద్దిపేటటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేట మున్సిపల్‌లో జరిగిన అభివృద్ధి బాగుందని తాము కూడా అమలు చేస్తామని రాష్ట్రంలోని 11 మంది మున్సిపల్ కమిషనర్లు, అధికారులు స్పష్టం చేశారు. సిద్దిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో అమలవుతున్న పనులను మున్సిపల్ శాఖ సీడీఎంఏ టీకే శ్రీదేవి ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట, మోత్కూర్, జనగామ, ఆలేరు, భువనగిరి, రామాయంపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుజురాబాద్ ఇలా 11 మంది మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, సిబ్బం ది శుక్రవారం సందర్శించారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ వారికి అమలుచేస్తున్న పనుల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని లింగారెడ్డిపల్లిలోని సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం, డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ), స్వచ్ఛబడి సందర్శించారు. పట్టణంలో ఇంటింటా వెలువడే తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతున్నట్లు కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ వివరించారు స్వచ్ఛబడిపై ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో పాటు ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం అన్ని హంగులతో నిర్మించిన స్వచ్ఛబడిని సందర్శించారు. పాత బొంగులు, సైకిల్ రీమ్‌లతో స్వచ్ఛ బడిలో నిర్మించిన ప్రహరీ పరిశీలించారు. ప్లాస్టిక్‌ను అరికట్టడానికి వార్డు స్థాయిలో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు వారికి వివరించారు. ఎవరైనా బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసినట్లయితే సీసీ కెమెరాల ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు. మరోసారి పునరావృతమైతే వారికి జరిమానా సైతం విధిస్తున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన, కృషి వల్ల సిద్దిపేట పట్టణం అన్నిరంగాల్లో ముందుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కంపోస్టు డెవలప్‌మెంట్ ఆఫీసర్ హేమలత, అధికారులు ప్రేరణ, హన్మంత్‌రెడ్డి, వనిత, సిబ్బంది, వార్డు అధికారులు పాల్గొన్నారు.



లింగారెడ్డిపల్లిలో సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్లు, అధికారులు

తాగునీటి సమస్యను తీర్చిన దాత

● రెండు బోర్లు వేయించిన ప్రసాద్‌రెడ్డి

కోహీర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి తన సొంత డబ్బులతో బోర్లు వేయించి గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, కాలనీలో తాగునీటి ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో రెండు బోర్లను తవ్వించారు. ప్రసాద్‌రెడ్డి తవ్వించిన బోరుబావుల్లో పుష్కలంగా నీరు రావడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



జి.హుక్రాన సమీపంలో రహదారి పక్కన కాలిపోయిన మొక్కలు

కాలిపోయిన హరితహారం మొక్కలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.హుక్రాన గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా అటవీశాఖతో పాటు పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటారు. ఇటీవల ఆయా పంట పొలాల రైతులు గడ్డిని కాల్చి వేయడంతో మొక్కల చుట్టూ ఉన్న గడ్డితోపాటు మొక్కలు కాలిపోయాయి. లక్షలు వెచ్చించి హరితహారంలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

ఈ నెల 3 నుంచి హనుమాన్ దీక్షలు



నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 3 నుంచి చారిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షలు ప్రారంభం కానున్నాయి. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి అకిల భారత సాధుసంతుల తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ ఆధ్వర్యంలో వందలాది మంది హనుమాన్ దీక్షలను స్వీకరిస్తారు. మండల దీక్షలు చేపట్టనున్న వారు మార్చి 3న ఉదయం 6 గంటల వరకు ఆశ్రమానికి చేరుకోవాలని సంగ్రాం మహారాజ్ తెలిపారు. పూర్తి వివరాల కోసం 9346907537 నంబరులో సంప్రదించాలన్నారు.



ఖేడ్‌లోని మార్కండేయ ఆలయం

ప్రతిష్ఠాపనోత్సవాలకు
ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని భక్త మార్కండేయ మహా దేవాలయం నిర్మాణం పనులు పూర్తి కావడంతో విగ్రహ ప్రతిష్ఠాపనకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో శివ పంచాయతన సహిత మార్కండేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి తమిళనాడులోని మహాబలిపురం నుంచి విగ్రహాలను తీసుకువచ్చారు. మార్చి 3 నుంచి 6 వరకు ఉత్సవాలను జరగనున్నాయి. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులతో ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో వివిధ మఠాధిపతులు అవదూత్‌గిరి మహారాజ్, సంగ్రాం మహారాజ్, సోమాయప్ప, బసవలింగ అవదూత్ మహారాజ్, గోపాల్ మహారాజ్, దేవగిరి మహారాజ్, కాశీనాథ్‌బాబా, అంబికా శివయోగి, కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, అంబాదాస్ మహారాజ్, విఠల్‌దాస్ మహారాజ్, దత్తు మహారాజ్, పండరి మహారాజ్‌లతో పాటు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

● ఇద్దరికి తీవ్ర గాయాలు



లారీని ఢీ కొట్టిన కారు, శ్యామ్ బహదూర్(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మెడ్చల్ జిల్లా టీచర్స్ కాలనికి చెందిన జరిగినశ్యామ్ బహదూర్ సింగ్ (41) తన స్నేహితులు చందు యాదవ్, వాకిటి సాయికుమార్‌తో కలసి చందు యాదవ్ కారులో రాయిపోల్ నుంచి మెడ్చల్‌కు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వెళ్తున్నాడు. గౌరారం వద్దకు రాగానే మామిడ్యాల కమాన్ వైపునకు హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ ఆకస్మాత్తుగా మలుపు తిరగడంతో కారు అదుప్పు తప్పి లారీని ఢీ కొట్టింది. దీంతో కారులో వెనక సీట్లో కూర్చున్న శ్యామ్ బహదూర్ తలకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు సీట్లో కూర్చున్న చందు యాదవ్, సాయికుమార్‌లకు తీవ్రగాయాలు కావడంతో చికిత్సకోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్యామ్ బహదూర్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ అదుపుతప్పి..



మృతి చెందిన భిక్షపతి

కొండపాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మర్పడగలో శుక్రవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్పడగ గ్రామానికి చెందిన గుడిగందుల భిక్షపతి (40)అనే వ్యక్తి పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో గురువారం సైకిల్‌పై నిత్యావసర సరకులు తీసుకురావడానికి వెళ్తుండగా సైకిల్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ..

ఝరాసంగం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏసురత్నం (56) గ్రామంలో చర్చి నూతన భవన నిర్మాణానికి నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. మృతుడి భార్య శోభరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కంకర క్వారీలో ఇటాచీ ఆపరేటర్..

జిన్నారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంకర క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు ఇటాచీ ఆపరేటర్ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్(30) గత పదేళ్లుగా మండలంలోని కాజీపల్లిలో నివాసముంటూ ఇటాచీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గ్రామ శివారులోని స్టోన్ క్రషర్ క్వారీ గుంతలో శుక్రవారం ఇటాచీతో పనులు చేస్తుండగా బండరాయి పైనుంచి వచ్చి ఇటాచీ పైన పడింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్సకోసం తరలించగా మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని యువకుడు..



సాయికార్తిక్ మృతదేహం

సదాశివ పేట, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గురనగర్ కాలనీకి చెందిన సాయికార్తిక్(18) ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి వైపు వెళ్తున్న క్రమంలో పట్టణం మెయిన్ రోడ్డుహస్ర ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు డివైడర్‌లో ఉన్న చెట్లకు నీళ్లు పడుతున్న మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌కు వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికార్తిక్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి అంబన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జాతరలో భక్తుల సందడి

వనదుర్గకు వైభవంగా రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- జయజయ ధ్వానాల మధ్య రథాన్ని లాగిన భక్తులు
- మూడో రోజూ జాతర సందడి


కిటకిటలాడుతున్న దుర్గమ్మ పరిసరాలు





– దుర్గామాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జయజయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గమ్మ రథం కదిలింది. ఏడుపాయల జాతర మూడోరోజు శుక్రవారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తజనం జై బోలో దుర్గామాత.. అంటూ వేనోళ్ల స్తుతిస్తూ రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. గుట్టలు ప్రతిధ్వనిస్తుండగా మేళ తాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఏడుపాయల వీధుల గుండా రథోత్సవం కొనసాగింది. ఆనవాయితీ ప్రకారం ఆలయ ఈవో, తహసీల్దార్, నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన తొలి బొట్టుదారులైన లచ్చిరెడ్డిగారి కుటుంబం, వతన్‌దారులైన గంగారెడ్డిగారి సాయిరెడ్డి ఇంటికి చేరుకొని బొట్టు సమర్పించి, 18 పనిబాటలవారితో కలిసి రథోత్సవానికి రావాలని కోరారు. ఆయన పనిబాటల వారితో కలిసి రాజగోపురం వద్ద గల ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన చావడి వద్దకు చేరుకున్నారు. రథోత్సవం హక్కుదారులైన లచ్చిరెడ్డి మేళ తాళాల మధ్య దేవాదాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను ఎదుర్కొని గర్భగుడి నుంచి దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి అందంగా అలంకరించిన రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం 18 రకాల పనివారు సంప్రదాయ క్రతువులను చేపట్టారు. రథం ముందు పట్టుపరిచి, దండకాలు వేస్తూ అన్నం వ్రతం పట్టుపోశారు. అనంతరం ఆలయ అధికారులు, ప్రముఖులు కొబ్బరికాయలు, గుమ్మడికాయలను కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన రథోత్సవం రాజగోపురం వద్దకు 12 గంటలకు చేరుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి తరించారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కృష్ణ, ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీటి కటకట.. పారిశుధ్య లోపం

ఏడుపాయల జాతరలో భక్తులకు తాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. జాతరలో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీటి కుళాయిలతో పాటు వసతిగృహాల్లో నీరు లేకపోవడంతో మినరల్ నీరు కొనుగోలు చేసి వంటలు చేసుకున్నారు. మహిళలకు ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నీరు సరఫరా కాకపోవడంతో పడరాని పాట్లుపడ్డారు. జాతర మొదటి రోజు నీరు రాక మహిళలు ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మూడు రోజులూ ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు పారిశుధ్య లోపంతో ఏడుపాయల క్షేత్రం అపరిశుభ్రంగా తయారైంది.

దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తిగౌడ్, బాపూరావు, జగన్, లింగారెడ్డితో పాటు సాయిరెడ్డి తదితరులు శుక్రవారం సాయంత్రం దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తొమ్మిదేళ్లకే ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్‌తో విహాన్‌రామ్

ధూళిమిట్ట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్(9) చిన్న వయస్సులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో (5685మీ), హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ పాతాల్సు(4250మీ)లను అధిరోహించినందుకుగాను, ఆయన పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించిందని బాలుడి తండ్రి తిరుపతినాయక్ తెలిపారు. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లుగా చిన్న వయస్సులోనే పెద్ద విజయాలు సాధించిన విహాన్‌రామ్‌ను పలువురు అభినందించారు.

జాతీయ సైన్స్ సంబరాలకు రెండు ప్రాజెక్టులు


మెమోంటోతో విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో సిద్దిపేట జిల్లా నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ కాంపిటీషన్ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్నోవేషన్, పుస్తక ప్రదర్శన, క్విజ్, పోస్టర్ మేకింగ్, ఫన్ విత్ సైన్స్ వర్క్‌షాప్ వంటి పోటీలు నిర్వహించారు. ఇందులో సైంటిఫిక్ ఎగ్జిబిషన్ ఇన్నోవేషన్‌లో పాఠశాలలు, కళాశాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రదర్శనలు ఎంపిక చేశారు. ఇందులో రెండు ప్రదర్శనలు సిద్దిపేట జిల్లాకు చెందిన కావడం, అవి మొదటి రెండు స్థానాల్లో నిలవడం విశేషం. జెడ్పీహెచ్ఎస్ దామరకుంట పాఠశాల నుంచి భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు చిన్న బ్రహ్మయ్య గైడ్ టీచర్‌గా, పదో తరగతి విద్యార్థి అశ్వంత్ రూపొందించిన 'ప్లాస్టిక్ బాటిల్ నుంచి ఫెన్సింగ్ దారం' ప్రాజెక్టు, లచ్చపేట ఉప్పల్‌వాయి ఆదర్శ పాఠశాల నుంచి జ్యోతి గైడ్ టీచర్‌గా తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రూపొందించిన రాకెట్ లాంచింగ్ విధానం ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ పాఠశాలలకు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్లను, విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడి, జిల్లా సైన్స్ అధికారి కళ్లేపల్లి శ్రీనివాస్ అభినందించారు.

సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు రాయపోల్ విద్యార్థి


అరవింద్

రాయపోల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి. అరవింద్ ఎంపికయ్యాడు. ఈ నెల 22న నల్గొండలో జరిగిన సెలక్షన్స్‌లో అరవింద్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 1 నుంచి 3 వరకు నల్గొండ జిల్లా ఎన్జీ స్టేడియంలో నిర్వహించే సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొంటారని పాఠశాల పీడీ గోవర్దన్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం నాగరాజు అభినందించారు.

పొటాష్.. గుళికలు కొంటేనే యూరియా..

దౌల్తాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యూరియా కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ షాప్‌నకు వెళ్తే పొటాష్, గుళికలు కొంటేనే యూరియా అమ్ముతామని కొర్రీలు పెడుతున్నారు. రైతులకు అవసరం లేకున్నా వాటిని కొంటేనే యూరియా అమ్ముతామని చెబుతుండటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొమ్మాట గ్రామానికి చెందిన గురువుగారి అంజయ్య గురువారం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి నాలుగు బస్తాల యూరియా కావాలని అడిగారు. అయితే, పొటాష్. గుళికలు తీసుకుంటేనే యూరియా అమ్ముతామని షాపు యజమాని కొర్రీ పెట్టాడు. దీంతో సదరు రైతు విషయాన్ని మీడియాకు వివరించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా, పొటాస్.. గుళికలు అవసరం లేకపోయినా కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణదాతలకు ప్రోత్సాహకం

క్షతగాత్రులకు సహకరిస్తే ఇబ్బందులు ఉండవు

'గుడ్ సమరిటన్'పై కొరవడిన అవగాహన.. ప్రారంభమై నాలుగేళ్లయినా ప్రయోజనం శూన్యం



సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన అనేక మంది సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే పోలీసు కేసుల్లో తమ పేర్లు చేర్చబడతాయనే భయంతోనో లేదా అనవసరంగా కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందనే ఆందోళనతోనో, మార్గమధ్యంలో చనిపోతే కేసు తమకు చుట్టుకుంటుందేమోనని అనుమానంతోనూ చాలా మంది తమ కళ్ల ముందు ప్రమాదం జరిగినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి భయాలను వీడి క్షతగాత్రులకు సాయం చేస్తే ప్రాణాలను నిలపవచ్చు. ఇలా సహాయం చేసిన వారికి గుడ్ సమరిటన్ చట్టం రక్షణగా ఉంటుంది. అంతేకాకుండా ప్రోత్సాహకాన్ని పొందవచ్చు.

సహాయకులకు అండగా గుడ్ సమరిటన్

ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందిస్తే గుడ్ సమరిటన్ చట్టం ద్వారా ప్రోత్సాహకం అందుతుందన్న విషయం చాలామందికి తెలియదు. దీనిని కేంద్ర ప్రభుత్వం (రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ) 2021 అక్టోబరు 3వ తేదీన ప్రారంభించింది. 2026 మార్చి 31వ తేదీ వరకు అమలులో వుంటుంది. గుడ్ సమరిటన్ సరైన ప్రచారం లేక ప్రజల్లో అవగాహన లేకుండాపోయింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే ఈ పథకం కింద రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ఎక్కువ మందిని రక్షించినట్లయితే పది మందిని ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం ఇస్తుంది. ఒక వ్యక్తి సంవత్సరంలో గరిష్ఠంగా ఐదుసార్లు ఈ అవార్డు పొందేందుకు అర్హుడు. ప్రతి సంవత్సరం పది మంది ఉత్తమ ప్రాణదాతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం లక్ష రూపాయలు ప్రోత్సాహకంగా అందిజేస్తుంది.

గోల్డెన్ అవర్ కీలకం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఏటా పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారు. సరైన సమయంలో స్పందిస్తే ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించే అవకాశం ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి గోల్డెన్ అవర్ అనేది కీలకం. ప్రమాదం జరిగిన గంటలోపే గాయపడిన వారిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తే 90 శాతం ప్రాణాలు రక్షించే అవకాశం వుంటుంది. గాయపడిన వారిని దగ్గరలోని ఏ ఆసుపత్రికైనా తీసుకెళ్లి కనీసం ప్రథమ చికిత్స చేసినా అతడు బతికే ఛాన్సుంటుంది. దీన్నే గోల్డెన్ అవర్ అంటారు.

మూడేళ్లుగా సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాద వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	798	466	754
2023	827	432	781
2024	852	384	913

అవగాహనేది?

క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు తరలించే విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు రోడ్డు రవాణా, రహదారుల శాఖగానీ, పోలీసు శాఖగానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గుడ్ సమరిటన్ చట్టం అమలులో ఉందన్న విషయం ఎవరికీ తెలియదు. సహాయకులకు ఎలాంటి భయం అవసరం లేదని తెలియజేయడంలో విఫలమయ్యాయి. ఈ చట్టం అమలులోకి వచ్చిన నాలుగేళ్లలో జిల్లాలో ఒక్కరు కూడా ప్రోత్సాహకం అందుకున్నవారు లేరంటే ఏ మేరకు ప్రచారం ఉందో దీన్ని బట్టే తెలుస్తోంది. మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు, హైవేస్ వెబ్‌సైట్ ద్వారా గుడ్ సమరిటన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. క్షతగాత్రులను గంట లోపు ఆసుపత్రికి తరలించిన తర్వాత స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే వారు ప్రాణదాత అంటూ ఒక లెటర్ ఇవ్వడంతో పాటు ప్రమాదానికి సంబంధించిన సమాచారంతో రశీదు ఇస్తారు. ఆసుపత్రి వర్గాలు కూడా ఈ వివరాలను ధ్రువీకరిస్తూ సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తాయి.

పథకంపై విస్తృత ప్రచారం



గుడ్ సమరిటన్ చట్టంపై జిల్లాలో విస్తృత ప్రచారం చేయనున్నాం. దీని గురించి సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రిలో సకాలంలో చేర్పించలేకపోతున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయాన్ని విడనాడాలి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవు. యువజన సంఘాలకు, జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

\- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

భూమి రిజిస్ట్రేషన్ లాగే విత్తన రిజిస్ట్రేషన్

- ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, పీపీవీఎఫ్ఆర్ఏ చైర్మన్ త్రిలోచన మహాపాత్ర



జహీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థిక ప్రగతి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, పీపీవీఎఫ్ఆర్ఏ (ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్) చైర్మన్ డా. త్రిలోచన మహాపాత్ర పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామ శివారులో ఉన్న డీడీఎస్-కేవీకేలో తెలంగాణలోని 16 కేవీకేల పరిధిలోని 103 మంది రైతులు, శాస్త్రవేత్తలకు పంటల రకాలు, రైతుల హక్కుల పరిరక్షణ పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూమిని ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటామో అలాగే విత్తనాలు, పంటలు, చెట్లను రిజిస్ట్రేషన్లను చేసుకోవాలన్నారు. పంటలను పండించిన, విత్తనాలను సంరక్షించుకుంటున్న రైతులకు హక్కులు ఉండాలని ఆయన పేర్కొన్నారు. కేవీకేలో రైతులు వారి ప్రాంతాల్లో పండిస్తున్న పంటలు, విత్తన బ్యాంకుల హక్కులపై రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. తెలంగాణలోని 16 కేవీకేల పరిధిలోని 103 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారని తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ 40 సంవత్సరాలుగా పాత పంటల సాగు, విత్తన సంరక్షణ, మహిళా రైతులచే విత్తన బ్యాంకుల ఏర్పాటుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ ఎల్లా

సరళమైన భాషలో యోచిస్తే ఉత్తమ పరిష్కారాలు

భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా

గీతంలో జాతీయ సైన్స్ దినోత్సవం

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సరళమైన భాషలో సైన్స్ గురించి ఆలోచిస్తే ఉత్తమమైన పరిష్కారాలు లభిస్తాయని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం ఛేంజ్ మేకర్స్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎదిగిన క్రమాన్ని వివరించారు. భారత్ బయోటెక్‌ను స్థాపించడం, కరోనా వాక్సిన్ కోవాక్సిన్, టైఫ్బార్ టీసీవీ, రోటావాక్ వంటి సంచలన వాక్సిన్‌లో అభివృద్ధి వరకు తన ప్రయాణాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం 12 నుంచి 15 శాతం జాతీయ స్థూల ఉత్పత్తి వృద్ధిని కోరుకుంటే.. అది ఆవిష్కరణలతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. దేశ ప్రస్తుత ఆవిష్కరణ స్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన అందుబాటులో ఉన్న శాస్త్రీయ జ్ఞాన సంపదను గుర్తించాలని, సైన్స్ ప్రాథమిక సూత్రాలను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. భరత్ మతుకుమిల్లి, గీతం చాన్సలర్ డాక్టర్ వీరందర్ సింగ్ చౌహాన్, ఐఐసీటీ పూర్వ డైరెక్టర్, గీతం విశిష్ట ఆచార్యుడు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గీతంలో నెలకొల్పిన మల్టీ డిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్లేషనల్ ఇనిషియేటివ్స్‌ను డాక్టర్ ఎల్లా ప్రారంభించారు. కార్యక్రమంలో జంట నగరాల్లోని సుమారు పది కళాశాలల నుంచి 550 మంది విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు. విద్యార్థుల ప్రశ్నలకు డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా సమాధానాలు ఇచ్చారు.

ముడి వీడేనా?

- ట్రిపుల్ ఆర్ కోసం మూడు సర్వేలు
- భూములు నోటిఫై చేసిన అధికారులు
- మూడో సర్వేకు సర్కారు ఓకే..
- రెండు చోట్ల డీ నోటిఫై చేయక ఇక్కట్లు
- నిర్మాణ అనుమతులు రాక పాట్లు



నర్సాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ నర్సాపూర్ పట్టణ ప్రజలకు పీడగా మారింది. ఈ రోడ్డు కోసం చేసిన సర్వే స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. సర్వే చేసిన ప్రాంతాలను నోటిఫై చేసి, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసిన అధికారులు.. ఆయా ప్రాంతాల గుండా రోడ్డు వెళ్లడం లేదని తేల్చినా.. వాటిని డీ నోటిఫై చేయకపోవడంతో నిర్మాణాలను అనుమతులు రాక జనం ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ట్రిపుల్ ఆర్ కోసం మూడు రకాల సర్వేలు చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అందులో ఒకటి నర్సాపూర్ పట్టణ సమీపంలో నుంచి ఉండటంతో అధికారులు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేసి, ప్రతిపాదించిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతటితో అధికారులు ఆయా ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులు నిలిపివేశారు. అనుమతులు లేకపోవడంతో బ్యాంకుల రుణాలూ పొందలేని పరిస్థితి.

రెండు చోట్ల ఇబ్బందులు

ట్రిపుల్ ఆర్ కోసం ప్రభుత్వం మూడు సర్వేలు చేసింది. నర్సాపూర్ పట్టణ సమీపం నుంచి సంగారెడ్డి మార్గంలోని రుస్తుంపేట కమాన్ సమీపం నుంచి, మెదక్ మార్గంలోని సీతారాంపూర్, గోకుల్ కాలనీ మీదుగా, వెల్దుర్తి మార్గంలో ఖండసరి షుగర్ ఫ్యాక్టరీ వరకు ట్రిపుల్ ఆర్ వెళ్లేలా సర్వే చేశారు. ఆ సమయంలోనే అధికారులు హద్దులు నిర్ణయించారు. రెండో సర్వే నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాల్లోని బ్రాహ్మణపల్లి, నాగ్సన్‌పల్లి, శివ్వంపేట మండలం పిల్లుట్ల తదతర ప్రాంతాల మీదుగా సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఈ రెండింటినీ పక్కన పెట్టిన హెచ్ఎండీఏ.. ట్రిపుల్ ఆర్ కోసం మూడో సర్వేను ఓకే చేసింది. అయితే, మొదట సర్వే చేసిన ప్రాంతాలను డీ నోటిఫై చేయాల్సి ఉంటుంది. కానీ, రోజులు గడుస్తున్నా.. డీ నోటిఫై చేయకపోవడంతో ఆయా ప్రాంతాల్లో కొత్తగా ఇళ్లు కట్టుకోవాలన్నా.. తమ అవసరాలకు స్థలాలు అమ్ముకోవడం, బ్యాంకు రుణాలు తీసుకోవడం వంటివి చేయలేకపోతున్నారు.

అనుమతులు లేవంటూ..

ఒక్క నర్సాపూర్ పట్టణ పరిధిలోనే సుమారు 200 మంది బాధితులు ఉన్నారు. ఇందులో కొందరు గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటూ సదరు భూమి హెచ్ఎండీఏ అధీనంలో ఉందని వస్తోంది. నిర్మాణాలు ప్రారంభించిన వారికి అనుమతులు లేవంటూ నోటీసులు వస్తున్నాయి. ట్రిపుల్ ఆర్ కోసం మూడో సర్వే ఖరారై.. భూసేకరణ కూడా జరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ కల్పించుకుని తమ భూములను డీ నోటిఫై చేయాలని బాధితులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

ట్రిపుల్ ఆర్ కోసం ప్రతిపాదిత ప్రాంతంలో అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆన్‌లైన్‌లో హెచ్ఎండీఏ డీ నోటిఫై చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లినందున త్వరలోనే పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

\- రామకృష్ణరావు, మున్సిపల్ కమిషనర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జరిమానా

గజ్వేల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. కొన్ని రోజులుగా గజ్వేల్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఏడుగురు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా, గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున రూ.7000 జరిమానా విధించినట్లు తెలిపారు.

చేర్యాలలో కౌన్సెలింగ్

చేర్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల సర్కిల్ స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదైన పలు వురు వాహనదారులకు చేర్యాల సీఐ ఎల్.శ్రీను కౌన్సెలింగ్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ బడిలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు

తొగుట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో 2010- 11 బ్యాచ్ విద్యార్థుల సహకారంతో వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ ఎంఈవో యాదవరెడ్డి శుక్రవారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులను తొగుట ఎంఈవో నర్సయ్య, పాఠశాల హెడ్‌మాస్టర్ రాజిరెడ్డి, సిద్దిపేట రూరల్ ఎంఈవో యాదవరెడ్డి అభినందించారు.

మెడిసిన్ విద్యార్థినికి లాప్‌టాప్ బహూకరణ

మర్కుక్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మెడిసిన్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని కృష్ణవేణికి లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్నేహ సభ్యులు టి.సాయిరాం వారి సోదరుడు విజయసారథి(అమెరికా) సౌజన్యంతో లాప్‌టాప్‌ను బహూకరించారు. శుక్రవారం మర్కుక్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థినికి లాప్‌టాప్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, సరితా, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రమణరావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఉద్యమకారులను ఆదుకోవాలని ముఖ్యమంత్రికి పోస్టుకార్డు

చేర్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరుతూ చేర్యాలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు శుక్రవారం పోస్టుకార్డులను పంపించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీసులో కార్డులు వేసిన అనంతరం ఫోరం నాయకులు అందె అశోక్, అంబటి అంజయ్య, బండోజు భాస్కర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది తమ విలువైన జీవితాలను త్యాగం చేశారని, ఇప్పటికీ కేసులు వేలాడుతుండటంతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఉద్యమకారులను ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.25వేల ఫించన్, గుర్తింపుకార్డు, 250గజాల ఇంటిస్థలాన్ని అందించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని జయప్రదం చేయండి

జగదేవ్‌పూర్/హుస్నాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని మాదిగ బిడ్డలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. జగదేవ్‌పూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు, మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు మాసపాక యాదగిరి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా పోరాటం చేసి అమరులైన వారికి జోహార్లు అర్పించాల్సిన బాధ్యత ప్రతీ మాదిగ బిడ్డపై ఉందన్నారు. మార్చి 1న ప్రతి గ్రామంలో అమరుల దినాన్ని జరపాలని సూచించారు. హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఎస్సీ వర్గీకరణకై ప్రాణాలను అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మాదిగలు, ఉపకులాలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

తుదిదశకు మల్లన్న హాల్ట్‌స్టేషన్

పూర్తికావచ్చిన ప్రహరీ, అప్రోచ్ రోడ్డు పనులు

వడివడిగా స్టేషన్ బిల్డింగ్, హాల్, ప్లాట్‌ఫాం నిర్మాణం

నెలాఖరుకు డెడ్‌లైన్.. రైలు ఆగేనా?




కొమురవెల్లి శివారులోని రైల్వేట్రాక్ పక్కన హాల్ట్‌స్టేషన్ భవనం, పూర్తయిన అప్రోచ్ రోడ్డు

చేర్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారులో చేపట్టిన మల్లన్న రైల్వే హాల్ట్‌స్టేషన్ నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపైన మార్చి 31లోగా స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్ధారించారు. ఈ మేరకు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

అప్రోచ్ రోడ్డు పూర్తి.. పురోగతిలో ఇతర పనులు

కొమురవెల్లి నుంచి రాజీవ్ రహదారికి వెళ్లే మార్గమధ్యం నుంచే రైల్వేలైన్ వెళుతుండగా ట్రాఫిక్ ఇబ్బందుల నివారణకు ఇక్కడ ఏర్పాటు చేసిన రైల్వేగేట్ సమీపం నుంచి అండర్‌పాస్‌ను నిర్మించారు. అండర్‌పాస్ నుంచి హాల్ట్ స్టేషన్‌కు వెళ్లేందుకు కొద్దిరోజుల క్రితం అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అలాగే, స్టేషన్ ప్రహరీని నిర్మించారు. హై లెవల్ ప్లాట్‌ఫాం ప్రాథమిక పనులు పూర్తి చేయగా, ఫ్లోరింగ్ టైల్స్ పనులు కొనసాగుతున్నాయి. ప్లాట్‌ఫాంతో పాటు స్టేషన్ ఆవరణలో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా గద్దెలు నిర్మించారు. తాగునీటి నల్లాల పనులు పూర్తిదశలో ఉన్నాయి. విద్యుత్ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్ భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా, మల్లన్న ఆలయ శోభ ఉట్టిపడేలా స్టేషన్ భవనాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించిన భవన నిర్మాణాలు పూర్తయితేనే ఈ సుందరీకరణ పనులను చేపడతారు. మార్చి 31లోగా ఆయా పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

రైలు నిలుపుతామన్న హామీ నెరవేరేనా?

సిద్దిపేట నుంచి మనోహరాబాద్ వరకు రైలు సేవలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హాల్ట్‌స్టేషన్ పనుల పూర్తికి మరింత సమయం పట్టనుండగా, అప్పటివరకు వేచిఉండకుండా కొమురవెల్లిలో రైలు ఆపుతామని కొన్నాళ్ల క్రితం ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం పలు సందర్భాలలో మల్లన్న హాల్ట్‌స్టేషన్ పనుల పురోగతిని ప్రస్తావిస్తూ వస్తున్నారు. కానీ ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో స్థానికులతో పాటు మల్లన్న భక్తులకు రైల్వే సేవలకు నోచుకోవడం లేదు. స్టేషన్ నిర్మాణంతో సంబంధం లేకుండా రైలును హాల్ట్ స్టేషన్‌లో నిలపాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవలో ముందుండాలి

● హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవ చేస్తూ ప్రజల మన్ననలను పొందాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ ఉద్యోగి బూర వెంకన్నగౌడ్ ఉదోగ్య విరమణ సన్మాన సమావేశంలో మాట్లాడారు. వెంకన్న తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. అనంతరం వెంకన్న, లక్ష్మి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్‌ఎస్ నాయకులు అన్వర్, ఎడబోయిన తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం



అంగడికిష్టాపూర్‌లో ఉమామహేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మర్కుక్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంగడికిష్టాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల భాగంగా శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన దర్మకర్త వెంకటనరసింహశర్మ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఆదిదంపతుల కల్యాణ క్రతువు కొనసాగింది. పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఉమామహేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రామారం మహదేవుడి ఆలయంలో

రాయపోల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహదేవుని ఆలయంలో ఉత్సవాలు ముగిశాయి. గురువారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం పార్వతీ పరమేశ్వరులను రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. రథం ఎదుట భక్తుల కోలాటాం ఆడుతూ తరించారు. రథంపై ఊరేగుతున్న స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ- పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఈపాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి రాధిక అన్నారు. దుబ్బాక ఏడీఏ మల్లయ్యతో కలిసి దౌల్తాబాద్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల ధరలను, స్టాక్ నిల్వలను, విక్రయ రికార్డులను పరిశీలించారు. ఎరువులు, గుళికల మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

చెరువును పరిశీలించిన తహసీల్దార్



చదును చేసిన చెరువును పరిశీలిస్తున్న ఎమ్మార్వో సుజాత

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. లకుడారం గ్రామంలో ఇసుక చెరువు శిఖం భూమిలో ఓ మాజీ సర్పంచ్ మట్టిని పోయించారు. గతంలో రెవెన్యూ అధికారులు పనులను నిలిపివేయగా మరోసారి భారీగా మట్టిని పోసి చదును చేశాడు. దీనిపై స్పందించిన కుకునూరుపల్లి ఎమ్మార్వో సుజాత అధికారులతో కలిసి శుక్రవారం చెరువులను పరిశీలించారు. సోమవారం నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సర్వే చేపడతామని తెలిపారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలి

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



ఎల్లమ్మ చెరువు పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను నాణ్యతతో చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. రూ.18 కోట్ల వ్యయంతో చేపట్టిన హుస్నాబాద్ ఎల్లమ్మచెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతతో పాటు సత్వరంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పనుల వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఇరిగేషన్ ఈఈ రాములునాయక్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

పోతారం(ఎస్) గురుకులం సందర్శన

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శించారు. విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సామగ్రి, భోజనాల నాణ్యతను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా టైలర్స్‌డే



కోహెడలో కేక్‌ను తినిపించుకుంటున్న టైలర్లు

కుకునూరుపల్లి/కోహెడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోహెడ, కుకునూరుపల్లిలో టైలర్స్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవిక్లబ్ ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు ఉప్పల రాజు ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలో టైలర్‌లు నర్సింహులు, అంజనేయులు పలువురిని సన్మానించారు. కోహెడలో మండల టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మండల టైలర్ యూనియన్ అధ్యక్షుడు గుగ్గిల శ్రీనివాస్ మాట్లాడుతూ దర్జీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, రాయితీలు కల్పించాలని, 50 ఏళ్లకే పించను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను మాజీ కౌన్సిలర్ మర్కంటి కనకయ్య ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి కలిశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అంతా సమన్వయంతో పనిచేసి బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని కేసీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

అప్రమత్తతతో అడ్డుకట్ట

5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేయాలి. వాటిని ఆటోమెటిక్ డిటెక్షన్ సిస్టంకు అనుసంధానం చేయాలి. ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలు, స్విచ్‌లు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలి. ప్రమాదం సంభవిస్తే హోటల్‌లో ఉన్న ప్రతీ వ్యక్తి బయటకు వెళ్లేలా ఎస్కేప్ ప్లాన్ ఏర్పాటు చేసుకోవాలి.

ఆస్పత్రుల్లో...

ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీ తప్పకుండా ఉండాలి. దాని పనితీరును అప్పుడప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. ఆసుపత్రి ఫ్లోర్లను ఫైర్ కంపార్ట్మెంట్స్‌గా విభజించి అగ్ని ప్రమాదాలు వ్యాపించకుండా జాగ్రత్త పడాలి. చెత్తాచెదారం పోగవ్వకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ర్యాంపులకు, మెట్లకు అడ్డంగా ఎటువంటి సామాన్లను ఉంచకూడదు అత్యవసర పరిస్థితుల్లో బిల్డింగ్ నుంచి బయటపడడానికి అత్యవసర మార్గాలు తెలిసేలా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలి. ఫైర్ అల్లారం విన్న వెంటనే భవనాన్ని ఖాళీ చేయాలి

పరిశ్రమల్లో...

ఎలక్ట్రికల్ పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పరిశ్రమల్లో సులభంగా మండే పదార్థాలను ఎలక్ట్రికల్ పరికరాలకు, గ్యాస్ సిలిండర్లకు, వేడి వస్తువులకు దూరంగా ఉంచాలి. రసాయనాలను ఒకేచోట కాకుండా వేరువేరుగా నిల్వ చేయాలి. వెల్డింగ్, కటింగ్, షోల్డరింగ్ పనులు చేసేప్పుడు తప్పకుండా అగ్నిమాపక అధికారుల అనుమతి తీసుకోవాలి. ఫైర్ డ్రిల్స్ మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా నిర్వహించాలి. రెండేళ్లకు ఒకసారి థర్డ్ పార్టీ ఫైల్ ఆడిట్ చేయించి వారి సూచనలను పాటించాలి



జాగ్రత్తగా ఉండాలి

వేసవిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరగడానికి అవకాశాలుంటాయి. ప్రజలు జాగ్రత్తగా ఉంటే నివారించవచ్చు. ఎక్కడైనా అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు జరిగితే 101కు కాల్ చేసి సమాచారం అందించాలి. అటవీ ప్రాంతాల్లో సిగరెట్ తాగితే తప్పకుండా ఆర్పివేయాలి. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- సందన్న, జిల్లా అగ్ని మాపక అధికారి, సిద్దిపేట

దుబ్బ రాజరాజేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా మల్లారెడ్డి



మల్లారెడ్డిని సన్మానించిన గ్రామస్థులు

తొగుట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం కాన్గల్ గ్రామంలోని దుబ్బ రాజరాజేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సోమగారి మల్లారెడ్డిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

హరీశ్‌రావు పరామర్శ

నంగునూరు ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు మాజీ ఉపసర్పంచ్ మహేందర్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు.



హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) బాలికల గురుకులంలో విద్యార్థుల ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రయోగ పనితీరును ఉపాధ్యాయులకు వివరిస్తున్న విద్యార్థులు



తొగుట మండలం ఘనపూర్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శించి, పనితీరును వివరించారు. ఉత్తమ ఎగ్జిబిట్లకు బహుమతులను అందజేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని మల్టీపర్పస్ హైస్కూలు, హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని బాలికల గురుకుల విద్యాలయంలో సైన్స్‌డే వేడుకలకు అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరై విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో సైన్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరై మానవ జీవితంలో సైన్స్ ప్రాధన్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. వర్గల్ నవోదయ విద్యాలయంలోప్రిన్సిపాల్ రాజేందర్ సీవీ రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు వివరించి, ఆయన గుర్తుగా 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. రాయపోల్ మండలం రాంసాగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మెంతుల మొలకలతో తీర్చిదిద్దిన సీవీరామన్ చిత్రపటం ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

నాన్నకు చూపించి అనర్థాలు వివరించు

సిద్దిపేట మల్టీపర్పస్ హైస్కూల్లో సిగరెట్ తాగటం వల్ల ఊపిరితిత్తులు పాడవుతాయనే ఎగ్జిబిట్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆసక్తిగా తిలకించారు. మీ నాన్న సిగరెట్ తాగుతారా అని విద్యార్థిని ప్రశ్నించగా, అందుకు అవును అని సమాధానం ఇవ్వగా నాన్నకు ఎగ్జిబిట్ చూపించి అనర్థాలు వివరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.



రాయపోల్ మండలం రాంసాగర్ పాఠశాలలో మెంతి ఆకులతో సీవీ రామన్ చిత్రాన్ని తీర్చిదిద్దిన విద్యార్థులు

'పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి'

మద్దూరు/ ధూళిమిట్ట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్దూరు, ధూళిమిట్ట మండలంలోని తోర్నాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తోర్నాలలో గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా కలిసిమెలిసి బతకాలని సూచించారు. ఆధునిక కాలంలోనూ అనవసరమైన పట్టింపులను అనుసరించి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ మహబూబ్, ఆర్‌ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు. మద్దూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతరులపై వివక్ష చూపించడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.